సాక్షి
అనంతపురం

సోమవారం ౹ 2 ౹ జూన్ ౹ 2025



అకాలంలో అధికం 8లో

2024-25లో 48 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. అకాల వర్షాలతో రూ.100 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లింది.



పడిపోయిన నిమ్మ ధరలు

కేవలం రెండు వారాల వ్యవధిలో నిమ్మకాయల ధరలు అమాంతం పడిపోయాయి.

ఎన్నో ఆశలు పెట్టుకున్న అన్నదాతలకు నిరాశ మిగిల్చాయి. 8లో

గరిష్టం/కనిష్టం

37.4°/23.9°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు గుత్తిలో 'పరిష్కార వేదిక'



అనంతపురం అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం గుత్తి పట్టణంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు.గుత్తిలో పత్తికొండ రోడ్డులోని వసుధ ఫంక్షన్ హాలులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలని పేర్కొన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలని సూచించారు. గుత్తి పట్టణ, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాటు తుపాకీ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీని చూపుతున్న సీఐ వెంకటరమణ

రాయదుర్గంటౌన్: ఓ వ్యక్తి అక్రమంగా తీసుకెళ్తున్న నాటు తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాయదుర్గం రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ వెంకటరమణ విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీ హీరేహాళ్ మండలంలోని పాత హడగలి గ్రామం వద్ద సీఐ వెంకటరమణ పర్యవేక్షణలో ఆదివారం ఎస్‌ఐ గురుప్రసాద్ వాహన తనిఖీ చేపట్టారన్నారు. ఈ క్రమంలోనే పాత హడగలి వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న కర్ణాటక రాష్ట్రం మొలకాల్మూరు తాలూకా కోనాపురం గ్రామానికి చెందిన బోయ గంగన్న పోలీసులను చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించాడన్నారు. అనుమానంతో గంగన్నను పట్టుకుని వాహనాన్ని తనిఖీ చేయగా నాటు తుపాకీ, నల్ల మందు లభ్యమయ్యాయన్నారు. డీ హీరేహాళ్ మండలం కుద్లూరు గ్రామంలోని ఓ దానిమ్మ తోటలో గంగన్న మామ నాగరాజు పనిచేస్తున్నాడన్నారు. తోటలో తిరుగుతున్న అడవి పందుల నుంచి కాపాడాలని చెప్పడంతో తన గ్రామానికే చెందిన బసవ అనే వ్యక్తితో నాటు తుపాకీ, నల్లమందును తీసుకుని గంగన్న కుద్లూరుకు వెళ్తున్నట్లు వెల్లడైందన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఏమ్మా.. రేషన్ బియ్యం అన్నం బాగా ఉంటోందా?

- లబ్ధిదారుని ఆరా తీసిన కలెక్టర్



కమ్మూరులో చిట్టెమ్మ ఇంట్లో రేషన్ బియ్యంతో వండిన అన్నం తింటున్న కలెక్టర్ వినోద్ కుమార్

కూడేరు: 'ఏమ్మా బియ్యం నాణ్యతగా ఉన్నాయా.. అన్నం బాగా అవుతోందా' అంటూ కలెక్టర్ వినోద్‌కుమార్ రేషన్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం కలెక్టర్ మండల పరిధిలోని కమ్మూరులోని రేషన్ షాపులో సరుకుల పంపిణీని తనిఖీ చేశారు. సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని డీలర్‌ను ఆదేశించారు. అనంతరం పలువురు కార్డుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి బియ్యంపై ఆరా తీశారు. చిట్టెమ్మ అనే మహిళ ఇంట్లో రేషన్ బియ్యంతో వండిన అన్నం తిన్నారు. అక్కడే ఉన్న మల్లేష్ కుమార్తె దీక్షను ఏం చదువుతున్నావమ్మా అంటూ పలకరించారు. పదిలో ఒక సబ్జెక్ట్ ఫెయిల్ అయినట్టు దీక్ష తెలపగా.. సప్లిమెంటరీలో ఉత్తీర్ణత సాధించాక ఉన్నత చదువులు చదవాలని, 'అనంత ఆణిముత్యాలు' పథకం ద్వారా చదివిస్తామని భరోసా ఇచ్చారు. బాలికలు మధ్యలోనే చదువులు మానేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవ నాయుడు, తహసీల్దార్ మహబూబ్ బాషా, సీఎస్‌డీటీ లక్ష్మీదేవి తదితరులు వీఆర్‌ఓ రామకృష్ణ పాల్గొన్నారు.





రాప్తాడు మండలం చిన్మయనగర్‌లో నిల్చునే ఓపిక లేక సంచులను లైన్‌గా ఉంచిన దృశ్యం, అనంతపురం మూడో రోడ్డులో రేషన్ షాపు వద్ద జనం క్యూ



తాడిపత్రిలో చౌక దుకాణం వద్ద క్యూలో ఉన్న మహిళలు

మొదటి రోజే.. చుక్కలు కనిపించాయ్!



ఈమె పేరు జయమ్మ. అనంతపురంలోని నవోదయ కాలనీవాసి. తన ఇంటి నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న స్టోర్ నం. 88లో ఆదివారం రేషన్ తీసుకునేందుకు వచ్చి లైన్‌లో నిలబడలేక చెట్టు కిందకు వెళ్లి కూర్చుంది. ఉదయం 8.30 గంటలకు నీళ్లు వస్తే పట్టేసి వచ్చానని, ఇక్కడేమో 9 గంటలైనా రేషన్ ఇవ్వడం మొదలు పెట్టలేదని వాపోయింది. రెండు రోజులే ఇచ్చి ఆ తరువాత బియ్యం అయిపోయాయని చెబుతారనే భయంతో మొహం కూడా కడుక్కోకుండానే మొదటి రోజే వచ్చినట్లు తెలిపింది. గతంలో తమ వీధిలోకే రేషన్ బండి వచ్చేదని, కేవలం 10 నిమిషాల్లో బియ్యం, సరుకులు తీసుకునేదాన్నని గుర్తు చేసుకుంది.

రేషన్ 'కష్టాలు' మొదలు

- చౌక దుకాణాల వద్ద కార్డుదారుల పడిగాపులు
- నిలబడలేక వంతులుగా సంచులు
- ఎండ వేడికి వృద్ధులు, మహిళలు తీవ్ర అగచాట్లు
- చాలా చోట్ల ఉదయం 8 గంటలకు తెరుచుకోని స్టోర్లు



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లో రేషన్‌షాపు వద్ద లబ్ధిదారుల పడిగాపులు

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి పేదలను కష్టాలు నీడలా వెంటాడుతున్నాయి. తాజాగా రేషన్ కష్టాలు మొదలయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ కోసం కార్డుదారులు ఎప్పుడూ ఇబ్బంది పడిన దాఖలాలు లేవు. ఇంటి వద్దకు ఎండీయూ వాహనం వచ్చినప్పుడు బియ్యం, నిత్యావసర సరుకులు తెచ్చుకునేవారు. అయితే, కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహన వ్యవస్థకు మంగళం పాడి చౌక దుకాణాల ద్వారానే సరుకుల పంపిణీకి తెరలేపడంతో పేద ప్రజలకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం మొదటి రోజే చుక్కలు కనిపించాయి. 'ఉదయమే ఇంటి పనులను వదిలేసుకుని చౌక దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చింది.. మాకేం కర్మ పట్టిందిరా స్వామి' అంటూ పలువురు వాపోయారు.

8 గంటలకూ తెరచుకోని స్టోర్లు..

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేయాలని డీలర్లకు అధికారులు ఆదేశాలిచ్చారు. అయితే జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల ఉదయం 8 గంటలకు చౌక దుకాణాలు తెరుచుకోలేదు. అప్పటికే రేషన్ తీసుకునేందుకు వచ్చిన కార్డుదారులు దుకాణాల వద్ద పడిగాపులు కాశారు. డీలర్లు నింపాదిగా 9 గంటల తరువాత పంపిణీ ప్రారంభించారు.

ఇబ్బంది పడ్డ వృద్ధులు, మహిళలు..

సరుకులు తీసుకునేందుకు చౌక దుకాణాల వద్దకు వచ్చిన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు లైన్‌లలో నిలబడలేక, ఎండలో అవస్థలు పడ్డారు. రాప్తాడు మండలం చిన్మయనగర్‌లో చౌక దుకాణం వద్ద చాలా ఆలస్యంగా పంపిణీ ప్రారంభించారు. ఉదయమే వచ్చిన కార్డుదారులు లైన్‌లో నిలబడలేక సంచులను వంతులుగా పెట్టి కూర్చున్నారు.

రెండు రోజులకు మించి ఇవ్వరు..!

చౌక దుకాణాల్లో ఒకటో తేదీ నుంచి 15 తేదీ వరకు రేషన్ పంపిణీ చేయాలని అధికారులు ఆదేశించారు. అయితే క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని కార్డుదారులు అంటున్నారు. బియ్యం, సరుకులు రెండు రోజులకు మించి ఇవ్వరని చెబుతున్నారు. ఆ తరువాత వస్తే అయిపోయాయని అంటారని, అందుకే పనులు వదిలేసుకుని మరీ బియ్యం తీసుకునేందుకు మొదటిరోజే వచ్చామని పేర్కొంటున్నారు. డీలర్లు కచ్చితంగా 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ చేసేలా అధికారులు చూడాలని, అలా ఇవ్వని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

కాచుకు కూర్చున్నాం



ఇంట్లో పనులు వదిలేసి సరుకుల కోసం రావాల్సి వచ్చింది. ఇక్కడికి వస్తే లైన్ పెద్దగా ఉంది. నిలబడలేక ఇళ్ల అరుగుల మీద కూర్చున్నాం. గతంలో మా ఇళ్లవద్దకు బండి వచ్చేది. ఎలాంటి ఇబ్బందీ లేకుండా సరుకులు తీసుకునేవాళ్లం. ఇప్పుడిలా స్టోర్ వద్ద కాచుకుని కూర్చోవాల్సి వచ్చింది.

– అరుణ, సాయినగర్, అనంతపురం

గంటల తరబడి వేచి ఉన్నా..



రేషన్ సరుకులు తీసుకోవాలంటే గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండే దుస్థితి దాపురించింది. గత ప్రభుత్వం తరహాలో ఇంటి వద్దనే రేషన్ వేయాలి. ప్రస్తుతం రేషన్ దుకాణాలు ఎప్పుడు తెరుస్తారో..ఎప్పుడు మూస్తారో అర్థం కావడం లేదు. దీంతో ఉదయం నుంచే రేషన్ దుకాణం వద్ద వేచి ఉండి బియ్యం తెచ్చుకున్నా. మా ఇంటి నుంచి రేషన్ షాపు కి.మీ దూరంలో ఉండడంతో చాలా ఇబ్బందిగా ఉంది.

– రాజేశ్వరి, గుంతకల్లు



అనంతపురంలో అవస్థలు పడుతూ రేషన్ సంచి తీసుకెళ్తున్న మహిళ

ప్రజా శ్రేయస్సే వైఎస్సార్ సీపీ ధ్యేయం

- వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేద్దాం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపు
- వెన్నుపోటుకు బాబు బ్రాండ్ అంబాసిడర్: పార్టీ పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్ రెడ్డి



వెన్నుపోటు దినం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, నరేష్‌కుమార్ తదితరులు

అనంతపురం కార్పొరేషన్: 'ప్రజల శ్రేయస్సే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ధ్యేయం. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పాటుపడ్డారు. ఇప్పుడు ప్రజలను నయవంచనకు గురి చేసిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు పోరాటాలకు సిద్ధమయ్యారు. సీఎం చంద్రబాబుకు కనువిప్పు కల్గించేందుకు వెన్నుపోటు దినం నిరసన ర్యాలీకి పిలుపునిచ్చారు' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఏ–7 కన్వెన్షన్‌లో వైఎస్సార్ సీపీ అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డితో కలసి ప్రజాప్రతినిధులు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, నగర కమిటీలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. 'అనంత' మాట్లాడుతూ ఈ నెల 4న ఉదయం 10 గంటలకు పాతూరు చెన్నకేశవ స్వామి దేవాలయం నుంచి నిరసన ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. గాంధీ విగ్రహం, వన్‌టౌన్ పీఎస్ మీదుగా కలెక్టరేట్ వరకు సాగుతుందన్నారు. ర్యాలీలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు, తొలి సంతకాలకు వన్నె తెచ్చిన నాయకులు దివంగత నేత వైఎస్సార్, ఆయన తనయుడు వైఎస్ జగన్ అని గుర్తు చేశారు. చంద్రబాబు ప్రస్థానమంతా వెన్నుపోటేనని విమర్శించారు. గత ఎన్నికలకు ముందు 'సూపర్ సిక్స్'తో పాటు 175 హామీలను అమలు చేస్తామని చెప్పి ఇప్పటి వరకూ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 1.30 లక్షల మందికి సచివాలయ ఉద్యోగాలు, 2.50 లక్షలకుపైగా వలంటీర్లకు అవకాశం కల్పించారన్నారు. జగన్ హయాంలో అభివృద్ధి పనులతో అనంతపురం నగర రూపురేఖలు మార్చేశామన్నారు.

ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే మద్యం మాఫియా

గతంలో మద్యం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు సంపద సృష్టించుకునేందుకు మద్యం మాఫియాకు తెరలేపారని 'అనంత' ధ్వజమెత్తారు. మద్యం బాటిల్‌పై అదనంగా ధర వసూలు చేస్తున్నారన్నారు. ప్రతినెలా మద్యం షాపుల నుంచి భారీగా ఎమ్మెల్యేలకు ముడుపులు అందుతున్నాయన్నారు. రెవెన్యూ, పోలీసు శాఖలను హస్తగతం చేసుకుని అక్రమ కేసులు, దౌర్జన్యాలు, హత్యలు చేస్తూ రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్నారన్నారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్..

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు మోసాలపై గళమెత్తుదామని, ఈ నెల 4న జరిగే వెన్నుపోటు దినం నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. చైతన్యానికి మారుపేరు అనంతపురం అని, వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాస్, పార్టీ జిల్లా టాస్క్ ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్, టీటీడీ మాజీ బోర్డు సభ్యులు అశ్వర్థ్ నాయక్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు ప్రసంగించారు. ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, ఓబిరెడ్డి, శ్రీదేవి, మల్లెమీద నరసింహులు, చంద్రశేఖర్ యాదవ్, అమర్‌నాథ్ రెడ్డి, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, చింతా సోమశేఖర్ రెడ్డి, నాయకులు కృష్ణవేణి, దత్తా, వెన్నం శివరామిరెడ్డి, కేశవరెడ్డి, బాకే హబీబుల్లా, పెన్నోబులేసు, చింతకుంట మధు, ఆసిఫ్, సాకే చంద్రలేఖ, సుజాత రెడ్డి, పార్వతి, భారతి, గౌని నాగన్న, జానీ, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో ఫెవికాల్ వీరులు

- ఏళ్లుగా జిల్లా కేంద్రంలోనే విధులు
- డిప్యుటేషన్ ముసుగులో తిష్ట
- అధికారులకు బురిడీ

- హెచ్చెల్సీలో ఓ ఉద్యోగి 25 ఏళ్లుగా పని చేస్తున్నారు. ఈయన తన సర్వీసులో అన్ని ప్రాంతాల్లో పనిచేసి ఉంటారని అనుకుంటే పొరపాటే. అనేక సంవత్సరాలుగా ఎస్‌ఈ కార్యాలయంలోనే ఉండిపోయారు. డిప్యుటేషన్ ముసుగులో 'ఫెవికాల్' వేసుకొని తిష్ట వేసినట్లు విమర్శలు వస్తున్నాయి. ఇటీవల ఈయనకు ప్రత్యేకంగా గది కేటాయించడం చర్చనీయాంశంగా మారింది.
- ఓ ఇరిగేషన్ ఉద్యోగి జిల్లా కేంద్రంలో దాదాపు 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. హెచ్చెల్సీ ఎస్‌ఈ కార్యాలయం, లోక్ డివిజన్, ధర్మవరం డివిజన్ అంటూ జిల్లా కేంద్రంలోనే తిరుగుతున్నారు తప్ప ఏనాడు క్షేత్రస్థాయిలో పనిచేసిన దాఖలాలు లేవు. ఇలాంటి ఉద్యోగులు హెచ్చెల్సీలో దాదాపు 25 మంది విధులు నిర్వహిస్తుండడం గమనార్హం.



హెచ్చెల్సీ ఎస్‌ఈ కార్యాలయం

అనంతపురం సెంట్రల్: జిల్లాలో తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ప్రాజెక్టు కీలకమైంది. ఉమ్మడి జిల్లా మొత్తానికి తాగునీరు, దాదాపు 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అలాంటి ప్రాజెక్టులో పాలన పూర్తిగా గాడి తప్పుతోంది. ఉద్యోగుల నియామకాల్లో విపరీతమైన రాజకీయం సాగుతోంది. పలుకుబడి ఉన్న వాళ్లు ఎప్పుడూ కీలక స్థానాల్లో ఉంటున్నారు. పైరవీలు చేయడం... ప్రాధాన్య సీట్లను దక్కించుకోవడం పరిపాటిగా మారింది. అధికారులు కూడా వీరికే వత్తాసు పలుకుతుండటంతో చాలా మంది ఉద్యోగుల సర్వీసు మొత్తం సుదూర ప్రాంతాల్లోనే సాగుతోంది. వాస్తవానికి నీటి సరఫరా జరిగే సమయంలో పరిపాలన సౌలభ్యం దృష్ట్యా డిప్యుటేషన్‌లు వేసుకునే వెసులుబాటు ఉంటుంది. సరఫరా ఆగిన తర్వాత యథావిధిగా వారి స్థానాలకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ హెచ్చెల్సీలో ఏళ్లుగా డిప్యుటేషన్‌లోనే విధులు నిర్వహిస్తున్నారు. ఓ ఉద్యోగి తన ప్రస్థానం ప్రారంభించినప్పటి నుంచి జిల్లా కేంద్రంలోనే ఉంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఈసారి కూడా పైరవీలకే పెద్దపీట..!

బదిలీలకు ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూడు నుంచి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్నవారికి, మ్యూచువల్, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారందరికీ బదిలీలు కావాలని ఉత్తర్వులు ఇచ్చింది. జూన్ 2 లోపు ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. హెచ్చెల్సీలో ఇప్పటి వరకూ బదిలీల గురించి అధికారికంగా ప్రకటించకపోయినా... ఇప్పటికే ఆ తంతు పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ సారి కూడా పైరవీలతో కొందరు ఉద్యోగులు చక్రం తిప్పినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధుల సిఫార్సులతో కొన్ని, డిప్యుటేషన్‌లతో కొన్ని పోస్టులను నియమిస్తున్నట్లు తెలుస్తోంది. దీని వెనుక భారీగానే ముడుపులు ముడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనల ప్రకారం ముందుకెళ్తాం

ఉద్యోగుల బదిలీలు నేటిలోపు పూర్తి చేయాల్సి ఉంది. జేఈలు, డీఈలు, ఈఈల బదిలీలు ఈఎన్‌సీ స్థాయిలో ఉంటాయి. మిగిలిన పోస్టులకు ఎస్‌ఈ స్థాయిలో బదిలీలు చేస్తాం. జీఓ ప్రకారం ఉద్యోగుల బదిలీలు నిర్వహిస్తామే తప్ప ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించే పరిస్థితి ఉండదు. డిప్యుటేషన్‌ల రద్దు విషయాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం.

– పురార్థనరెడ్డి, ఎస్‌ఈ, హెచ్చెల్సీ

'బోగస్'పై కలెక్టర్ దృష్టి

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: బోగస్ సర్టిఫికెట్లతో ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్లు పొందాలని చూస్తున్న కొందరి టీచర్ల వ్యవహారంపై కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టి సారించారు. బోగస్ సర్టిఫికెట్లతో పాయింట్లు పొందుతున్న వైనంపై 'సాక్షి'లో వరుసగా ప్రచురితమైన కథనాలకు కలెక్టర్ స్పందించారు. ఈ వ్యవహారంపై డీఈఓ ప్రసాద్‌బాబుతో మాట్లాడారు. స్పౌజ్, పీహెచ్, లీగల్లీ సపరేటెడ్ తదితర అంశాల్లో అర్హత లేకున్నా బోగస్ సర్టిఫికెట్లతో ప్రిఫరెన్షియల్ కేటగిరీకి చేరారనే విషయాలపైనా, మరికొందరు టీచర్లు స్టేషన్ పాయింట్లు నమోదులో ఇష్టానుసారంగా వ్యవహరించారనే అంశంపైనా ఆరా తీశారు. వీటిపై క్షుణ్ణంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో కలెక్టర్ పేరుతో జారీ చేసిన సర్క్యులర్ విద్యాశాఖ, ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతోంది.

లేని రోగాలను సృష్టించుకుని...

అనువైన స్థానాల్లో చేరేందుకు కొందరు టీచర్లు అడ్డదారులు ఎంచుకున్నారు. లేని రోగాలను సృష్టించుకుని, తక్కువ ఉన్న వైకల్యాలను ఎక్కువ శాతం చూపిస్తూ, అన్ని అవయవాలూ సక్రమంగా పని చేస్తున్నా పైరవీలు చేసి తెచ్చుకున్న బోగస్ వైద్య ధ్రువీకరణపత్రాలతో పాయింట్లు పొందేందుకు పన్నాగం పన్నారు. ఈ క్రమంలో గత కౌన్సెలింగ్‌లలో జనరల్ కేటగిరీల్లో ఉన్న చాలామంది ఈసారి ప్రిఫరెన్షియల్ కేటగిరీ, ప్రత్యేక పాయింట్ల జాబితాల్లో చేరారు. ఉద్యోగంలో చేరినప్పుడు వైకల్యం ఉన్నవారితో పాటు ప్రమాదవశాత్తూ, మరేదైనా కారణాలతో మధ్యలో వైకల్యం పొందిన వారికి ఎవరూ అభ్యంతరం చెప్పరు. అయితే వయసు రీత్యా వినపడకపోవడం, కంటిచూపు తగ్గడం సహజం. ప్రమాదవశాత్తూ కిందకు పడినప్పుడు చిన్నచిన్న సర్జరీలు చేసుకోవడం కూడా సహజమే. అయితే వీటినే పెద్ద బూచీగా చూపిస్తూ అడ్డగోలుగా పాయింట్లు పొందుతున్నారు. వీరి వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు.

ఎంఈఓలతో సమావేశం

ఆదివారం స్థానిక శారదా నగర పాలక ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంఈఓలతో డీఈఓ ప్రసాద్‌బాబు సమావేశం ఏర్పాటు చేశారు. పాతస్టేషన్ పాయింట్ల నమోదును ఎక్కువగా ఎస్జీటీలే వాడుకున్నారని ఇందుకు ఎంఈఓలదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. గరిష్టంగా 24కు మించి అర పాయింటు కూడా ఎక్కువ ఉండకూడదన్నారు. స్టేషన్ పాయింట్లు, రీఆపోర్ష్మెంట్‌కు గురైన టీచర్లు ఇష్టానుసారం పాయింట్లు వేసుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి టీచరునూ విచారించి తేడా ఉంటే సరి చేయాలన్నారు. జాగ్రత్తగా ఒకటికి రెండు సార్లు పరిశీలించాలన్నారు. గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి కావాలని, ఎవరికైనా నిబంధనలకు విరుద్ధంగా పాయింట్లు ఉన్నట్లయితే సదరు టీచరుతో పాటు ఎంఈఓపైనా చర్యలుంటాయని డీఈఓ స్పష్టం చేశారు.

క్లుప్తంగా

వివాహిత బలవన్మరణం

యాడికి: స్థానిక చౌడేశ్వరి కాలనీకి చెందిన వివాహిత ధనలక్ష్మి (35) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... చేనేత పనులతో జీవనం సాగిస్తున్న ధనలక్ష్మి, తిరుపతయ్య దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకునేవి. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువరైతు ఆత్మహత్య

బ్రహ్మసముద్రం: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం పొబ్బర్లపల్లికి చెందిన బోయ నాగరాజు (35)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. తనకున్న ఐదు ఎకరాల పొలంలో పంటల సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షలకు చేరుకుంది. ఈ క్రమంలో సాగు చేసిన బూడిద గుమ్మడి, టమాట పంటలో దిగుబడులు లేక మరోసారి నష్టపోయాడు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదంటూ కుటుంబసభ్యులతో చెప్పుకుని బాధపడిన ఆయన శనివారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్ తెలిపారు.

బస్సు దిగుతూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి మృతి

అనంతపురం: బస్సు దిగబోతు ప్రమాదవశాత్తు కిందపడి ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నగరంలోని బుడ్డప్ప నగర్‌లో నివాసముంటున్న షేక్ హాజీ అబ్దుల్ కరీం (83) ఆర్టీసీలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు భార్య ఫజులున్నీసా, ఇద్దరు కుమారులు. నలుగురు కుమార్తెలు ఉన్నారు. కళ్యాణదుర్గంలో నివాసముంటున్న పెద్ద కుమారుడి వద్దకు గత నెల 30న వెళ్లారు. మధ్యాహ్నం భోజనం ముగించుకున్న రాత్రి 7 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల వద్ద బస్సు దిగే సమయంలో ప్రమాదవశాత్తూ కింద పడి తలకు గాయమైన అబ్దుల్ కరీంను వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆదివారం ఆయన మృతి చెందారు. ఘటనపై మూడో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అకాలంలో అధికం

- 2024-25లో 48 శాతం ఎక్కువగా వర్షపాతం
- అకాల వర్షాలతో రూ.100 కోట్లకు పైగా పంట నష్టం
- ఆదివారంతో ప్రారంభమైన 2025-26 వర్ష సంవత్సరం



గత ఆగస్టులో అధిక వర్షాలకు దెబ్బతిన్న టమాటాను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: పంటలకు అవసరం లేని సమయంలో వాన పడటంతో ఈ ఏడాది అధిక వర్షపాతం నమోదైంది. 2024-25కు సంబంధించి వార్షిక వర్షపాతం శనివారంతో ముగిసింది. ఆదివారం నుంచి 2025-26 వర్షపాత సంవత్సరం మొదలైంది. ఏటా జూన్ 1 నుంచి మే 31 వరకు వర్షపాత సంవత్సరంగా పరిగణిస్తారు. ఇందులో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు అత్యంత కీలకమైన ఖరీఫ్‌గానూ, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు రబీగానూ, ఆ తర్వాత వేసవి కాలంగా గుర్తిస్తారు. నైరుతీ రుతుపవనాలతో ఖరీఫ్‌లో నాలుగు లక్షల హెక్టార్లు, ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రబీ కింద లక్ష హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారు.

అధికమే... కానీ!

ఈ ఏడాది వార్షిక సాధారణ వర్షపాతం 512.5 మి.మీ కాగా 48 శాతం అధికంగా అంటే 761.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ లెక్కన మంచి వర్షాలు కురిసినట్లుగానే ఉన్నా.. ఖరీఫ్‌లో పంటలు విత్తుకోవడం, పంటలు కీలక సమయమైన జూలై, అలాగే సెప్టెంబర్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూలైలో సాధారణం కన్నా ఏకంగా 61 శాతం, సెప్టెంబర్‌లో 56.4 శాతం తక్కువగా వర్షాలు పడటంతో పంటలు బాగా దెబ్బతిన్నాయి. అలాగే రబీకి సంబంధించి నవంబర్‌లో 36.4 శాతం తక్కువగా వర్షం కురవడంతో పంట దిగుబడులు తగ్గిపోయాయి. పెద్దగా అవసరం లేని జూన్, ఆగస్టు, డిసెంబర్, ఏప్రిల్, మే నెలల్లో ఎక్కువగా వర్షాలు కురవడంతో రైతులకు లాభం కన్నా నష్టమే ఎక్కువగా జరిగింది. ఏప్రిల్‌లో ఏకంగా 56.3 మి.మీ. మేర అకాల వర్షాలు కురిశాయి. మే నెలలో అయితే 36.7 మి.మీ.గానూ మరీ అధికంగా 101.3 మి.మీ. వర్షపాతం నమోదు కావడం విశేషం. ఈ అకాల వర్షాల వల్ల వందల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు నేలవాలడంతో రైతులకు రూ.100 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. అలాగే డిసెంబర్‌లో వరుస తుఫాన్లతో జడి పట్టుకోవడం, మేఘాలు ఆవరించడంతో ఉద్యాన పంటల దిగుబడులపై ప్రభావం చూపింది. ఖరీఫ్‌లో 36 వర్షపు రోజులు (రెయినీడేస్), రబీలో 13, వేసవిలో 13.. మొత్తంగా ఈ ఏడాది 62 వర్షపు రోజులు నమోదయ్యాయి. 23 మండలాల్లో సాధారణం కన్నా అధికంగానూ 8 మండలాల్లో సాధారణ వర్షపాతం రికార్డయింది. మొత్తమ్మీద 12 నెలల్లో ఆరు నెలలు సాధారణం కన్నా తక్కువగా మిగతా ఆరు నెలలు ఎక్కువగా నమోదు కావడంతో చివరకు 49 శాతం అధికంగా నమోదుకావడం గమనార్హం.

2024-25లో వర్షపాతం ఇలా

నెల	సాధారణం	కురిసింది	తక్కువ/ఎక్కువ
జూన్	61.0 మి.మీ.	147.7 మి.మీ.	142.1 శాతం అధికం
జూలై	63.9 మి.మీ.	24.4 మి.మీ.	61.8 శాతం తక్కువ
ఆగస్టు	83.8 మి.మీ.	210.8 మి.మీ.	151.6 శాతం అధికం
సెప్టెంబర్	110.9 మి.మీ.	48.4 మి.మీ.	56.4 శాతం తక్కువ
అక్టోబర్	100.9 మి.మీ.	135.1 మి.మీ.	33.9 శాతం అధికం
నవంబర్	28.6 మి.మీ.	18.2 మి.మీ.	36.4 శాతం తక్కువ
డిసెంబర్	9.8 మి.మీ.	17.3 మి.మీ.	76.5 శాతం అధికం
జనవరి	1.8 మి.మీ.	00	100 శాతం తక్కువ
ఫిబ్రవరి	0.8 మి.మీ.	00	100 శాతం తక్కువ
మార్చి	2.1 మి.మీ.	1.7 మి.మీ.	19 శాతం తక్కువ
ఏప్రిల్	12.1 మి.మీ.	56.3 మి.మీ.	365.3 శాతం అధికం
మే	36.7 మి.మీ.	101.3 మి.మీ.	176.1 శాతం అధికం

ద్రోహులను పార్టీ ఉపేక్షించదు

- పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్‌సీపీలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పార్టీ క్రమ శిక్షణ నూతన కమిటీని అధిష్టానం నియమించిందన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చైర్మన్‌గా ఉన్న కమిటీలో సభ్యులుగా తనతో పాటు తానేటి వనిత, రెడ్డిశాంతి, అనిల్‌కుమార్ ఉన్నారన్నారు. ఇటీవల జరిగిన కమిటీ తొలి సమావేశంలో కొన్ని తీర్మానాలు, నిర్ణయాలు, విధివిధానాలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆశయం మేరకు ప్రజలతో పార్టీ కేడర్ ఉండాలన్నారు. పార్టీకి వెన్నుపోటు పొడిచినా, ఇతర పార్టీలతో లోపాయికారి ఒప్పందాలు చేసుకున్న వారిలో పార్టీ మార్పు కోరుతోందని, అయినా వారు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న 125 మందిపై చర్యలు తీసుకోగా, ఇందులో తన సొంత నియోజకవర్గానికి చెందిన ఐదుగురు ఉన్నారన్నారు. బహిష్కరణకు గురైన వారిలో మార్పు రాకుండా అదే పంథాను కొనసాగిస్తుంటే మాత్రం చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. వారిని సమర్థించే నాయకత్వంపైన కూడా చర్యలుంటాయన్నారు.

కమ్ముకుంటున్నా.. కరుణించట్లేదు!

- ఇంకా మొదలు కాని 'నైరుతి' ప్రభావం
- గాలి వేగానికి చెదిరిపోతున్న మేఘాలు



అనంతపురం అగ్రికల్చర్: ఆశల నైరుతి రుతుపవనాలు ఈ సారి చాలా ముందుగానే గత నెల 26న ప్రవేశించడంతో అన్నదాతలు సంబరపడ్డారు. ఖరీఫ్ సాగుకు ఇబ్బంది లేకుండా విస్తారంగా వర్షాలు పడతాయని ఆశించారు. కానీ... 'నైరుతి' ప్రవేశించి వారం కావొస్తున్నా ప్రభావం మాత్రం చూపడం లేదు. రుతుపవనాలు రాకమునుపు జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురిశాయి. 'నైరుతి' ప్రవేశించాక అనుకూల వాతావరణం మధ్య మంచి వర్షాలు కురుస్తాయని ఆశించినా ఆ పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. వారం రోజులుగా అక్కడక్కడా తేలికపాటి మినహా ఎక్కడా మంచి వర్షపాతం నమోదు కాలేదు. 15 నుంచి 20 కిలోమీటర్ల వేగంతో వీస్తున్న గాలుల ధాటికి మేఘాలు చెదిరిపోతున్నాయి. ఈ క్రమంలో మూడు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. 36 నుంచి 38 డిగ్రీలు, రాత్రిళ్లు 23 నుంచి 26 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. ఈ నెల 15 నుంచి... జూలై నెలంతా ఖరీఫ్ కింద పంటల సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు. మరోపక్క వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ రాయితీ విత్తన పంపిణీ మొదలు పెట్టకపోవడం.. కూటమి సర్కారు నుంచి ఇప్పటివరకు ఎలాంటి సాయం లేక సాగుకు రైతులు ఇబ్బంది పడుతున్న పరిస్థితి. కాగా రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు అక్కడక్కడా 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని తెలిపారు.

ఇరు కుటుంబాల ఘర్షణ

- రాజకీయ రంగు పులిమిన పచ్చ నేతలు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కేసు బనాయించేలా కుట్ర



దాడిలో సొమ్మసిల్లిపోయిన రాజు

తాడిపత్రి టౌన్/పెద్దపప్పూరు: నియోజకవర్గంలో టీడీపీ నాయకుల నీచ రాజకీయాలు పరాకాష్టకు చేరాయి. పెద్దపప్పూరు మండలం తిమ్మనచెరువులో ఇరు కుటుంబాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణకు రాజకీయ రంగు పులిమి వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు బనాయించి పైశాచిక ఆనందాన్ని పొందారు. వివరాలు.. తిమ్మనచెరువు గ్రామానికి చెందిన తలారి ఆంజనేయులు ఆదివారం గ్రామ దేవతలకు మొక్కు చెల్లించి విందు ఏర్పాటు చేసాడు. కార్యక్రమానికి అదే గ్రామానికి చెందిన ఓబులేసు కుటుంబసభ్యులూ హాజరయ్యారు. కాగా, ఓబులేసుకు కుమార్తె రత్నమ్మ, కుమారులు రాజు, నాగేంద్ర, ఓబులేసు ఉన్నారు. రత్నమ్మకు 15 సంవత్సరాల క్రితమే వివాహమైంది. కుమార్తె కుటుంబానికి తండ్రికి మధ్య చాలా కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో విందు కార్యక్రమంలో ఇరు కుటుంబాలు తారసపడి ఘర్షణకు దిగాయి. రత్నమ్మపై తండ్రి ఓబులేసు, తమ్ముడు రాజు చేయి చేసుకున్నారు. దీంతో రత్నమ్మ భర్త చిన్నరంగయ్య, అమె బావ పెద్దరంగయ్య, కొడుకు మనోజ్ వెంటనే ఓబులేసు, రాజుపై కర్రలతో, పైపులతో దాడి చేశారు. తండ్రిని, అన్నను కొడుతున్నారన్న విషయం తెలుసుకున్న నాగేంద్ర, ఓబులేసు వెంటనే అక్కడకు చేరుకుని చిన్న రంగయ్య, పెద్ద రంగయ్య, మనోజ్‌పై కొడవలి, కర్రలతో ప్రతి దాడికి దిగారు. ఘటనలో వీరితో పాటు బంధువులు కిట్ట, వేణుకూ గాయాలయ్యాయి. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు తొలుత తాడిపత్రిలోని ఆస్పత్రికి, అనంతరం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఓబులేసు కుమారుడు రాజు అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వేమనాథరెడ్డి కారు డ్రైవర్ కావడంతో టీడీపీ నాయకులు వెంటనే రాజకీయ రంగు పులిమి ఆ పార్టీ నేతలపై దాడులు చేశారంటూ వివాదానికి తెరలేపారు. అక్కడితో ఆగకుండా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కేసులు నమోదు చేసేలా పోలీసులపై ఒత్తిళ్లు తీసుకెళ్లారు. కాగా, ఘటనకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో మెరిసిన సోనాక్షి



బంగారు పతకాలను చూపుతున్న సోనాక్షి

అనంతపురం: సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ (ఎస్‌బీకేఎఫ్) ఆధ్వర్యంలో గోవా వేదికగా గత నెల 30 నుంచి రెండు రోజుల పాటు సాగిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో నిర్వహించగా.. రోలర్ స్కేటింగ్ విభాగంలో జిల్లాకు చెందిన చిన్నారి ప్రతిభ చాటింది. అండర్-5 కేటగిరిలో ఏకంగా రెండు బంగారు పతకాలను కైవసం చేసుకున్న బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన కె.వేణుగోపాల్, మౌనిక దంపతుల కుమార్తె సోనాక్షిని ఆమె చదువుతున్న మాంటిస్సోరి పాఠశాల యాజమాన్యం ఆదివారం అభినందించింది.

ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ బదిలీ

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ కర్నూలుకు బదిలీ అయ్యారు. ఆదివారం ఉదయం ఉత్తర్వులు రాగా...మధ్యాహ్నానికి ఆయన రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో వైఎస్సార్ కడప జిల్లాలో పనిచేస్తున్న వెంకటేశును నియమించారు. అలాగే డీఈఓ కార్యాలయంలో పని చేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణయ్య రెండు రోజుల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. మరో పోస్టు కొద్ది రోజులుగా ఖాళీ ఉంది. దీంతో ఈ రెండు స్థానాలను అధికారులు భర్తీ చేశారు. వైఎస్సార్ కడప జిల్లా డీఈఓ కార్యాలయంలో ఏడీగా పని చేస్తున్న మునీర్‌ఖాన్, కర్నూలు జిల్లా డీఈఓ కార్యాలయంలో ఏడీగా పని చేస్తున్న శ్రీనివాసులును ఇక్కడికి బదిలీ చేశారు. అలాగే ఇక్కడి డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న సరళను కర్నూలు డీఈఓ పరిధిలోని పాఠ్యపుస్తకాల విభాగానికి బదిలీ చేశారు.

వంచకుడిపై చర్యలు తీసుకోండి

- పోలీసులను ఆశ్రయించిన యువతి
- న్యాయం చేయలేదంటూ సోషల్ మీడియా వేదికగా వీడియో

గుమ్మఘట్ట: ప్రేమ పేరుతో తనను లోబర్చుకుని మోసం చేసిన యువకుడిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను ఓ యువతి ఆశ్రయించింది. బాధితురాలు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం పూలకుంటకు చెందిన దంపతులకు ముగ్గురు కుమార్తెలు కాగా, వ్యవసాయ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. వీరి పెద్ద కుమార్తె జిల్లా సరిహద్దున ఉన్న కర్ణాటకలోని మొలకాల్మూరులో ఇంటర్ పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆమెను ప్రేమ పేరుతో సొంత గ్రామానికి చెందిన నాగప్ప, నాగమ్మ దంపతుల కుమారుడు సురేష్ లోబర్చుకున్నాడు. పెళ్లి పేరుతో మూడేళ్ల పాటు తన చుట్టూ తిప్పుకున్నాడు. ఆమె అడిగిన ప్రతిసారీ తన అన్న పెళ్లి జరిగేంత వరకూ ఓపిక పట్టాలని నచ్చ చెబుతూ వచ్చాడు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం యువకుడి అన్నకు పెళ్లైంది. దీంతో పది రోజుల క్రితం ఆమె నిలదీయడంతో యువకుడు ముఖం చాటేశాడు. దీంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న ఆమె విషయాన్ని గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లింది. వారు స్పందించకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. అయినా పోలీసులు పట్టించుకోవడం లేదంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తుండగా తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం చర్చనీయాంశమైంది. ఈ విషయంపై ఎస్‌ఐ ఈశ్వరయ్యను వివరణ కోరగా విచారిస్తున్నామని తెలిపారు.

పడిపోయిన నిమ్మ ధరలు

- బస్తా రూ.5వేల నుంచి రూ.1,500 లోపు
- ఆందోళనలో రైతులు



తాడిపత్రి మార్కెట్‌కు వచ్చిన నిమ్మబస్తాలు

తాడిపత్రి రూరల్: కేవలం రెండు వారాల వ్యవధిలో నిమ్మ కాయల ధరలు అమాంతం పడిపోయాయి. గత నెలలో బస్తా నిమ్మకాయల ధర రూ.5 వేలు ఉండగా ఆదివారం నాటికి రూ.1,000 నుంచి రూ.1,500కు పడిపోయింది. మారిన వాతావరణ పరిస్థితులు, కురుస్తున్న వర్షాల వల్ల నిమ్మ ధరలు తగ్గినట్లుగా తెలుస్తోంది.

నాలుగు మండలాల్లో విస్తారంగా నిమ్మ సాగు

తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి, పుట్లూరు మండలాలతోపాటు వైఎస్సార్ కడప జిల్లా సరిహద్దులోని రైల్వే కొండాపురం మండలంలోని పలు గ్రామాల్లో నిమ్మ సాగు విస్తారంగా ఉంది. ఆయా ప్రాంతాల నుంచి తాడిపత్రిలోని మార్కెట్ యార్డుకు నిమ్మ కాయలను మంగళ, శుక్ర, ఆదివారాల్లో రైతులు తీసుకువస్తుంటారు. బస్తాలో 1,000 నుంచి 1,100 వరకు నిమ్మకాయలు ఉంటాయి. కాయ నాణ్యత, సైజును బట్టి మూడు రకాలుగా విభజించి వేలం వేస్తారు. వేలంలో కొనుగోలు చేసిన వ్యాపారులు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ఇక్కడ ధర గిట్టుబాటు కాకపోతే రైతులు జిల్లాలోని పలు ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు.

మార్కెట్‌లో తగ్గిన నిమ్మకాయల ధరలు..

గత ఏడాది ఇదే సమయానికి నిమ్మ ధరలు రైతులకు కాస్త వెసులుబాటుగా ఉండేది. అప్పట్లో బస్తా రూ.2వేల నుంచి రూ.3వేల వరకు అమ్ముడుపోయింది. ఈ ఏడాది రుతు పవనాలు వారం రోజులు ముందుగా జిల్లాను పలకరించాయి. దీంతో ఆకాశం మబ్బులు కమ్ముకోవడం, వాతావరణ పరిస్థితులు చల్లబడటంతో నిమ్మ ధరలు అమాంత పడిపోయినట్లుగా తెలుస్తోంది.

మరింత తగ్గుతాయి



నేను తాడిపత్రిలోని మార్కెట్‌లో డైలీ నిమ్మకాయలు అమ్ముతుంటాను. గత నెలలో రూ.20కి 5 కాయలు అమ్మేవాళ్లం. ఇప్పుడు రూ.10కే 5 కాయలు ఇస్తున్నాం. పరిస్థితి చూస్తుంటే నిమ్మ కాయల ధరలు మరింత తగ్గే అవకాశముంది.
– రసూల్‌బీ, వ్యాపారి, తాడిపత్రి

ప్రమాదంలో వివాహిత మృతి

రాయదుర్గం టౌన్: మండలంలోని కదరంపల్లి సమీపంలో చోట చేసుకున్న ప్రమాదంలో ఓ వివాహిత మృతి చెందింది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... ఆవులదట్ల గ్రామానికి చెందిన వివాహిత కవిత(28) ఆదివారం తన సోదరుడు నవీన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై గుండ్లపల్లికి బయల్దేరారు. కదరంపల్లి టోల్‌గేట్ సమీపంలోకి చేరుకోగానే వెనుకనే ఆర్‌బీ వంక గొల్లలదొడ్డి గ్రామం నుంచి కెంచానపల్లిలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న శివప్ప ఢీకొన్నాడు. ప్రమాదంలో బలమైన గాయమైన కవితను ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందింది. నవీన్‌తో పాటు ప్రమాదానికి కారణమైన శివప్ప, అతని తాత ఉలెప్పకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆస్పత్రికి స్థానికులు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఉలెప్పను అనంతపురానికి తీసుకెళ్లారు. కాగా, మృతురాలు కవితకు భర్త నాగరాజు, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలుగు తమ్ముళ్ల దౌర్జన్యం



దౌర్జన్యంగా పగులగొట్టిన ప్రహరీ

అనంతపురం/అనంతపురం క్రైం: జిల్లా కేంద్రం చుట్టుపక్కల భూమి తమవేనంటూ తెలుగు తమ్ముళ్లు దౌర్జన్యానికి తెరలేపారు. బాధితులు తెలిపిన మేరకు... కక్కలపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 144/2ఏలో మొత్తం 1.76 ఎకరాల్లో ఆర్.కృష్ణారెడ్డి కుమారుడు హనుమంతరెడ్డికి 0.73 సెంట్లు, మహమ్మద్ షఫీ కుమారుడు సయ్యద్ షామీర్‌కు 0.58 సెంట్లు, మహేష్‌బాబు భార్య జి.విజయలక్ష్మికి 0.08 సెంట్లు, షేక్ మహబూబ్‌బాషా కుమారుడు షేక్ ఇమాం బాషాకు 0.08 సెంట్ల స్థలం ఉంది. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు గత 20 సంవత్సరాలుగా పక్కాగా ఉన్నాయి. వీటి ఆధారంగా బ్యాంక్ రుణాలు సైతం పొందారు. ఆ స్థలంలో నీటి బోర్లు, కాంపౌండ్ వాల్, షెడ్డు, డోర్ నంబర్లు, కరెంట్ బిల్లులూ ఉన్నాయి. గత నెల 28న సర్వేయర్ ఉమామహేశ్వర్ ఫోన్ చేసి హద్దులు చూపిస్తానని తెలపడంతో వారు హక్కుదారులు అక్కడకు వెళ్లారు. అప్పటికే ప్రహరీని జేసీబీతో కూల్చివేసి స్థలాన్ని కబ్జా చేసుకునే ప్రయత్నం సాగుతుంటే అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో అనంతపురం నియోజకవర్గ ప్రజాప్రతినిధికి చెందిన 50 మంది అనుచరులు దౌర్జన్యానికి దిగారు. ఆ భూమి తమదంటూ దుర్భాషలాడుతూ హక్కుదారులను పక్కకు లాగేశారు. బాధితులు వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని కూల్చివేతలను అడ్డుకున్నారు. కానీ, ఇప్పటి వరకూ దౌర్జన్యపరులపై ఎలాంటి చర్యలూ లేవు. అలాగే కియా కార్ల షోరూం వెనుక ఉన్న ఎకరాలోపు స్థలంలో కుటుంబ సభ్యులపై అనంతపురం, రాప్తాడు ప్రజాప్రతినిధులకు చెందిన ముఖ్య అనుచరులు దాడి చేశారు. నగరంలోని అరవిందనగర్‌కు చెందిన వెంకటేష్ ప్రసాద్ గుప్తాకు చెందిన ఈ స్థలం అత్యంత విలువైనది. దీనిపై కన్నేసిన టీడీపీ నేతలు శనివారం ఆ స్థలం వద్దకెళ్లి కబ్జాకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న వెంకటేష్ ప్రసాద్ గుప్తా, అతని కుమారులు ప్రణీత్, సాయినాథ్ అక్కడకు చేరుకోవడంతో టీడీపీ నేతలు దాడికి తెగబడ్డారు. ఘటనలో వెంకటేష్‌ప్రసాద్ గుప్తా చెవికి తీవ్ర గాయమైంది. బాధితులు డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో నాల్గో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే టీడీపీ నేతలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, తీవ్రంగా గాయపడిన వెంకటేష్ ప్రసాద్ ప్రస్తుతం కర్నూలులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై నాల్గోపట్టణ సీఐ కె.సాయినాథ్ మాట్లాడుతూ.. భూ వివాదాలపై ప్రాథమికంగా విచారణ చేపడతామన్నారు. బాధితులకు రాత్రి, ఉదయం ఫోన్ చేసి విచారణకు రావాలని సూచించామని, వారిచ్చే ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.





ధర్మవరంలోని పార్థసారథి నగర్ సచివాలయం ఎదుట పేరుకుపోయిన చెత్త కుప్ప, పుట్టపర్తికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన పడేసిన చెత్త



ఎంఈఓ కార్యాలయం వద్ద పేరుకుపోయిన అపరిశుభ్రత

ఇదీ జనమెరిగిన 'సత్య'ం

ధర్మవరం.. దుర్గంధమయమైంది. ఎటు చూసినా చెత్త కుప్పలు, పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో పారిశుధ్యం మెరుగుకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గతంలో ఎన్నడూ ఇంతటి దుర్భర స్థితిని చూడలేదని... సాక్షాత్తు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఇలాకాలోనే పరిస్థితి ఇలా ఉంటే... ఇక రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటోందో ఊహించుకోలేక పోతున్నామని స్థానికులు అంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



తారక రామాపురం కాలనీలో పందుల స్వైరవిహారం

క్లుప్తంగా

ఉన్నత చదువులు చదివించాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు

అనంతపురం టవర్‌క్లాక్: ప్రతి ఒక్కరు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని అడిషనల్ ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు సూచించారు. ఆదివారం స్థానిక శ్రీనివాస కళ్యాణ మంటపంలో రాయలసీమ మహా బలిజ సంఘం ఆధ్వర్యంలో పదవ తదగతిలో అత్యాధిక మార్కులు సాధించిన బలిజ కుల విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టంతో చదవాలన్నారు. సమాజం కోసం సేవలు చేయాలంటే మంచి ఉద్యోగం సాధించి సేవ చేయవచ్చనన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టంతో చదివిస్తుంటారని.. మీరు చెడు వెసనాలకు బానిస కాకుండా ఉన్నత ఉద్యోగాలు సాధించి మీ తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ మహా బలిజ సంఘం అధ్యక్షులు శంకరయ్య, మాజీ అధ్యక్షులు పామురాయి వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తోపుదుర్తి రాజశేఖరరెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని బసంపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పెద్దన్న శనివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకుని పెద్దన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే బసంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శివయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ధరణేశ్వర్‌రెడ్డి, అభిలాష్ రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లిలో దేశాయి నాగభూషణ రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నీ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. తొలి మ్యాచ్‌ను టాస్ వేసి దేశాయి ధరణేశ్వర్ రెడ్డి, కేర్ అండ్ క్యూర్ ఆస్పత్రి సీఈఓ అభిలాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి టోర్నమెంట్‌లు దోహదపడతాయన్నారు. క్రీడాకారుల మధ్య ఆహ్లాదకరమైన పోటీ ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచులు బాల బొజ్జయ్య, పెద్ది రెడ్డి, మాజీ ఎంపీటీసీ అక్కులప్ప, టపాల మాధవయ్య, టపాల రాజు, చిన్న వెంకటరాముడు, రాజేంద్ర, వెంకటరాముడు, నారా శివారెడ్డి, అన్నగిరి ప్రకాష్, చిత్ర నాగభూషణ, ఈశ్వర్ రెడ్డి, మాజీ డీలర్ చిన్నకృష్ణ, సాకే వెంకటరాముడు, నారాయణ చౌదరి పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోండి



విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న ఎస్కేయూ వీసీ అనిత

అనంతపురం ఎడ్యుకేషన్: చదువుతోనే జీవితంలో గొప్పస్థాయికి చేరుతారని ఎస్కేయూ వీసీ అనిత పేర్కొన్నారు. పదోతరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన జిల్లాలోని ఈడిగ కుల విద్యార్థులకు గౌడ (ఈడిగ) ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేశారు. స్థానిక రాయల్ నగర్‌లోని రేణుకా యల్లమ్మ కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంటిగౌని విశ్వనాథ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్కేయూ వీసీ అనిత మాట్లాడుతూ .. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించాలని ఆకాంక్షించారు. అనంతరం అనిత, వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్‌గౌడ్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శిరిగే మనోహర్, గౌడ సంఘం నాయకులు మార్కండేయగౌడ్, నారాయణస్వామి, నాగభూషణం, మేకల గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.







అనంతపురంలో వేలిముద్ర వేస్తున్న వృద్ధురాలు, రాప్తాడు మండలం చిన్మయనగర్‌లో రేషన్ షాపు వద్ద వేచి ఉన్న కార్డుదారులు, రాప్తాడు మండలంలో రేషన్ షాపు ముందు సీసీ రోడ్డుపై కూర్చొన్న లబ్ధిదారులు

పరేషన్

కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసి కార్డుదారులు రేషన్ షాపుల వద్దకే వెళ్లి రేషన్‌సరుకులు తీసుకునేలా జూన్ నెల నుంచి ఆదేశాలు జారీ చేసింది. రేషన్ సరుకులు తీసుకునేందుకు రేషన్ కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం రాప్తాడు, అనంతపురం నగర వ్యాప్తంగా వ్యాప్తంగా రేషన్‌షాపుల ద్వారా సరుకులు పంపిణీ జరిగింది. ఆయా రేషన్‌షాపుల వద్దకు కార్డుదారులు గుంపులుగా చేరారు. ఉదయం కొద్దిసేపు సర్వర్ పని చేసింది. అనంతరం పని చేయకపోవడంతో కార్డుదారులు అసహనం వ్యక్తం చేశారు. ఉదయం ఎండ తీవ్రత ఉండగా ప్రజలు రేషన్ సరుకులు తీసుకునేందుకు ఎండలోనే వేచి ఉండటం కనిపించింది. పలుచోట్ల రేషన్‌షాపుల ముందు ఉదయాన్నే క్యూలో నిలుచుకున్నారు. ఇక ఎండల తీవ్రతను తట్టుకోలేక చెట్ల నీడలో పేద తీరారు. గతంలో రేషన్ సరుకులు వ్యాన్ ద్వారా తమ ఇళ్ల వద్దకు వచ్చేవని.. ఇప్పుడు అవస్థలు పడుతున్నామని పలువురు మహిళలు తెలిపారు.

– రాప్తాడు/అనంతపురం/చెన్నేకొత్తపల్లి:



చెన్నేకొత్తపల్లిలో రేషన్ సరుకుల కోసం ప్రజల క్యూ

కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు అన్యాయం

అనంతపురం ఎడ్యుకేషన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా పేదల జేబుల్లోకి డబ్బులు వెళ్తే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పెద్దోళ్ల జేబుల్లోకి వెళ్తున్నాయని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4న తలపెట్టిన 'వెన్నుపోటు' దినోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాండ్, ల్యాండ్, లిక్కర్, అమరావతి భూ మాఫియా నడుస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందన్నారు. జగనన్న ఉన్న సమయంలో ప్రతినెలా ఏదో ఒక పథకం ద్వారా డబ్బులు వచ్చేవన్నారు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అయిన చంద్రబాబు ప్రభుత్వంలో ప్రజలు పథకాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు.

బీహార్‌ను తలదన్నేలా పాలన

రాష్ట్రంలో అరాచకంగా బీహార్‌ను తలదన్నేలా పరిపాలన సాగుతోందన్నారు. చివరకు శాంతిభద్రతలపై ఢిల్లీలో కూడా గళం ఇప్పే పరిస్థితి దాపురించిందన్నారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో 390 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను హత్య చేశారన్నారు. మరో 376 మందిపై హత్యాయత్నాలు, కార్యకర్తలపై 2,466 అక్రమ కేసులు బనాయించారన్నారు. 500 మందిని జైల్లో పెట్టారని.. 440 మంది సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. వీరిలో 79 మందిని జైళ్లకు పంపారన్నారు.



మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

మాపై తప్పుడు ప్రచారాలా?

మీరు చేసిన ఫైబర్‌నెట్, లిక్కర్ నేరాలు, స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం, అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు స్కాం, ఐటీ అసైన్‌మెంట్, శ్యాండ్ మైనింగ్ స్కాంల గురించి ప్రజలు మరిచిపోవాలని, సంబంధిత విచారణ ఏజెన్సీలు మరిచిపోవాలని గత ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసే కార్యక్రమం చేస్తున్నారని, తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ఎమ్మెల్యేలు బ్రాంది షాపుల్లో సీసాకు పది రూపాయలు, చికెన్ సెంటర్లలో కేజీ చికెన్‌కు పది రూపాయల కమిషన్ పెట్టుకున్నారన్నారు. జగనన్న మీద తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారని, ఆయనపై కేసులు పెట్టి బయట తిరగగలుగుతారా? అని ప్రశ్నించారు.

జగన్‌మోహన్‌రెడ్డి హత్యకు కుట్ర

లింగమయ్య హత్య జరిగిన తర్వాత ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని హత్యకు కుట్ర చేశారంటూ ఆరోపించారు. ఇందులో భాగంగానే ఆయనకు సరైన భద్రత కల్పించలేదన్నారు. హెలిప్యాడ్ వద్ద పోలీసులు చాలా తక్కువగా ఉండడంతో తమ కార్యకర్తలు అభిమాన నాయకుడిని చూసేందుకు దూసుకొచ్చారన్నారు. ఈ సమయంలో హెలికాప్టర్ రెక్కలకు ఎవరి చేయి తగిలినా బ్లాస్ట్ అయి వందలాది మంది చనిపోయేవారన్నారు. జగనన్న భద్రత కంటే కూడా అక్కడికి అభిమానులను రానీయకుండా అడ్డుకునేందుకే పోలీసులు డ్యూటీలు చేశారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ చంద్రకుమార్, వైస్ ఎంపీపీలు చియ్యేడు కృష్ణారెడ్డి, రాప్తాడు రామాంజి, నాయకులు లీగల్ సెల్ నాగిరెడ్డి, బండి పవన్, గోవింద రెడ్డి, లోకనాథరెడ్డి, మీనుగ నాగరాజు, నీరుగంటి నారాయణరెడ్డి, చియ్యేడు కృష్ణారెడ్డి, వెంకటేష్, బండా అంజియాదవ్, లింగారెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలి

అనంతపురం కల్చరల్: సమాజంలో ప్రతివారు మూఢనమ్మకాలను వీడి శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలని ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అశాస్త్రీయ భావజాలం పెరుగుతుండడం ఆందోళన కల్గిస్తోందని, ప్రజలను చైతన్యవంతులు చేయడానికి జేవీవీ మరింత శ్రమించాలని పిలుపునిచ్చారు. ఎక్కువ మంది సభ్యులతోనే ప్రచారం సాధ్యమని అందుకు ప్రతి జేవీవీ సభ్యుడు పూర్తి భాగస్వామి కావాలన్నారు. సమాజంలో నానాటికి పెరిగిపోతున్న అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా జేవీవీ చేస్తున్న కృషిని అభినందించారు. కేవలం పట్టణాలకు, నగరాలకు పరిమితం కాకుండా గ్రామస్థాయి వరకు జేవీవీ భావజాలాన్ని తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, కోశాధికారి మహ్మద్ జిలానీ, నాయకులు రాజు, రామిరెడ్డి, తిరుపాల్, ప్రసాదరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన ప్రక్రియలో అనేక అసంబద్ధ సమస్యలు ఎదురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఏపీటీఎఫ్ నాయకులు వాపోయారు. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. అన్ని ఉపాధ్యాయ కేడర్స్‌కు సంబంధించి తాత్కాలిక సీనియార్టీ లిస్టులోని సమస్యలను పరిష్కరించి ఫైనల్ సీనియార్టీ లిస్టులను వెబ్ ఆప్షన్స్‌కు ముందే విడుదల చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ల ప్రమోషన్ల తర్వాత వారి స్థానాలను వేకెన్సీ లిస్ట్‌లో చేర్చి తరువాత కౌన్సెలింగ్ వారికి చూపించాలన్నారు. వివిధ కేడర్ల పదోన్నతుల తర్వాత మిగులుగా గుర్తించిన టీచర్లను అదే పాఠశాలలో కొనసాగించాలన్నారు. స్టేషన్ పాయింట్లు 24కు మించి వచ్చిన వాటిని సరిచేసి సీనియార్టీ లిస్టులను సవరించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీల సీనియార్టీ జాబితాలను డేట్ ఆఫ్ బర్త్ ప్రకారం కాకుండా మెరిట్ కం రోస్టర్ ప్రకారం తయారు చేయాలని డిమాండ్ చేశారు. పీఎస్‌హెచ్‌ఎం బదిలీల తర్వాత ఆ ఖాళీలను ప్రదర్శించి స్కూల్ అసిస్టెంట్ బదిలీలకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఇంగ్లీష్ పదోన్నతులు 230కు తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నర్సింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, నాయకులు లక్ష్మీనారాయణ, ఈశ్వరయ్య, గోపాల్ నాయక్, తిప్పేస్వామి, రామ్మూర్తి, సయ్యద్ కలీం, నసూరుల్లా, ఇందాదుల, పూలబాషా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

'ఆశ్రయ' సేవలు అభినందనీయం

అనంతపురం కల్చరల్: వృద్ధులు, అనాథల సేవలో తరిస్తున్న ఆశ్రయ యర్రగుంట్ల కృష్ణారెడ్డి అభినందనీయుడని వక్తలన్నారు. ఆదివారం పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆశ్రయ వృద్ధాశ్రమం ద్వారా స్ఫూర్తిదాయక సేవలందిస్తున్న కృష్ణారెడ్డికి ఆత్మీయ సత్కారం గావించారు. కమలానగర్‌లోని ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ సంస్థ కన్వీనర్ టీవీరెడ్డి, మన్రో మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు తోట నాగరాజు, ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ అధ్యక్షుడు కేపీ రాజు తదితరులు మాట్లాడారు. అనంతలో అనేక స్వచ్ఛంద సంస్థలు తమ వంతు ఆదర్శప్రాయమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని వాటిలో కొందరు జేఏసీగా ఏర్పడి ప్రతి నెల ఒక స్ఫూర్తిదాయకమైన సామాజిక సేవా కార్యకర్తను ఆత్మీయంగా సత్కరించాలని తీర్మానించామన్నారు. ఆ నేపథ్యంలో దశాబ్దాలుగా రక్తదాతగా, వృద్ధాశ్రమ నిర్వాహకునిగా, మానవతామూర్తిగా నిరంతరం సమాజానికి సేవలందిస్తున్న కృష్ణారెడ్డిని అభినందించామన్నారు. ముఖ్యంగా రసాయనాలతో ప్రమాదకారిగా మారుతున్న కేకుల సంస్కృతి కాకుండా సహజ ఫలాలను వివిధ సందర్భాలలో ఉపయోగించడంపై ప్రచారం గావించాలని తీర్మానించామన్నారు. సామాజిక సేవా కార్యకర్తలు కమల్‌నాథ్, మనోహర్, సుధాకర్ పాల్గొన్నారు.



ఆశ్రయ కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థల జేఏసీ నాయకులు

మహిళా క్రికెట్‌కు ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న మచ్చా రామలింగారెడ్డి

అనంతపురం: మహిళా క్రికెట్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని ఆంధ్ర మహిళా క్రికెట్ ఆపరేషన్స్ మాజీ మేనేజర్ మచ్చా రామలింగా రెడ్డి అన్నారు. అనంతపురం ఆర్డీటీ క్రీడా మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి అండర్-15, అండర్-19 ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి వి.భీమలింగా రెడ్డి అధ్యక్షత వహించారు. అండర్-15, అండర్-19 సెలక్షన్ కమిటీ సభ్యులుగా సీనియర్ క్రీడాకారులు డి.అనిత, పి.రాధిక, ఎస్.అరుణ వ్యవహరించారు. కార్యక్రమంలో ఏసీఏ సౌత్ జోన్ అడ్మినిస్ట్రేటీవ్ మేనేజర్ సాగర్ చౌదరి, సీనియర్ ఆటగాళ్లు షాబుద్దీన్, యుగంధర్, కమలాకర్ నాయుడు, ప్రసాద్, విజయరాజు, కోచ్‌లు నరేష్, ఫిట్నెస్ ట్రైనర బొమ్మన్న పాల్గొన్నారు.

ఒత్తిడి తగ్గించుకోవాలి

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగా చేయాలని ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఇలియాజ్ బాషా సూచించారు. ఆదివారం మండలంలోని రెడ్డిపల్లి వద్ద ఉన్న అనంతపురం జిల్లా జైల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఏఆర్ అడిషనల్ ఎస్పీతోపాటు డీఎంహెచ్‌ఓ డాక్టర్ దేవి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జిల్లా జైల్లో ఖైదీలు మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు ధ్యానం, యోగా చేయాలన్నారు. తద్వారా మంచి ఆరోగ్యంతో పాటు ఒత్తిడి తగ్గించుకోవచ్చన్నారు.

కల్యాణం.. కమనీయం



అలంకరణలో శ్రీవల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలు



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఆత్మకూరు: పంపనూరలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం షష్ఠి సందర్భంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రాలు, మంగళ వాయిద్యాలతో కనుల విందుగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేకంగా పంచామృతాభిషేకాలు నిర్వహించి ఆకు పూజలు చేశారు. అనంతరం మూల విరాట్‌ను ప్రత్యేకంగా పట్టువస్త్రాలతో అలంకరించి విశేష పూజలు చేపట్టారు. స్వామి వారి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో కాలసర్పదోష నివారణ రాహు కేతు హోమాలు నిర్వహించారు.

ఇళయరాజా సంగీతం వినూత్నం

అనంతపురం కల్చరల్: దక్షిణ భారత చలనచిత్ర సంగీత పరిశ్రమకు ఎనలేని సేవలందించిన ఇళయరాజ ప్రయోగాలు వినూత్నమని వక్తలు కొనియాడాయారు. ఆదివారం రాత్రి అనంత ఉపాధ్యాయ కళాసమితి విజయ రాఘవన్ ఆధ్వర్యంలో 'శివ పూజకు చివురించిన సిరి సిరి మువ్వ' పేరిట స్థానిక లలిత కళాపరిషత్తులో సంగీత విభావరి వీనుల విందుగా సాగింది. ప్రసిద్ధ సంగీత దర్శకులు ఇళయరాజ మ్యూజికల్ ఈవెంట్‌లో అద్భుతమైన గీతాలతో ఆకట్టుకున్నారు. తాడేపల్లి గూడెంకు చెందిన లైవ్ ఆర్కెస్ట్రా కావడంతో జిల్లా వ్యాప్తంగా వచ్చిన గాయనీ గాయకులు తమదైన ప్రతిభతో శ్రోతలను అలరించారు. గాయనీ గాయకులందరూ ఉపాధ్యాయులే కావడంతో ఈ సందర్భంగా వారు ఆయా పాటల సందర్భంలో ఇళయరాజ స్వరపరిచే విశిష్టతను తెలియజేయడం ఆసక్తికరంగా సాగింది. లలితప్రియం విరిసినది.. రాసలీల వేళ, హలో గురూ ప్రేమకోసమే నా జీవితం వంటి పాటలు కరతాళధ్వనులతో హోరెత్తించాయి. కార్యక్రమంలో అనంత ఉపాధ్యాయ కళాసమితి సభ్యులు బాలమురళీకృష్ణ, రామాంజి, చంద్రమౌళి, దాదా ఖలందర్, శ్రీనివాస్, చంద్ర, శ్రీదేవి, విజయలక్ష్మి, డాక్టర్ శాంతిప్రియ, లక్ష్మీరాయల్, చరిత, శుభమంగళ తదితరులు ఇళయరాజ పాటలతో ఆకట్టుకున్నారు.



గీతాలు ఆలపిస్తున్న గాయకులు

తహసీల్దార్ కార్యాలయం వద్ద నేడు ధర్నా

కనగానపల్లి: కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రైతాంగ సమస్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మహదేవ్ తెలిపారు. ఆదివారం ఆయన మండల కేంద్రం కనగానపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. ఈ ధర్నా కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులతో పాటు సీపీఐ నాయకులు, రైతులు, కార్మికులంతా తప్పక పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

రాప్తాడురూరల్: భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) రాష్ట్ర సమితి పిలుపు మేరకు ప్రజా సమస్యలపై అనంతపురం రూరల్ మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11 గంటలకు అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు మండల కార్యదర్శి రమేష్ తెలిపారు. ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన పేదలందరికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలనామనరు. సూపర్-6 హామీలు అమలుపై ధర్నా చేస్తున్నామన్నారు. ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ హాజరవుతారన్నారు. పేదలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మురళీనాయక్ త్యాగం చిరస్మరణీయం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం: అమరవీరుడు మురళీనాయక్ త్యాగం చిరస్మరణీయమని డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. అమిటి క్రికెట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరవీరుడు మురళీనాయక్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విజేత జట్టుగా కిషోర్ ఎలెవన్ నిలిచింది. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న టోర్నీ ఫైనల్ మ్యాచ్ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సేవ కోసం ప్రాణాలు కోల్పోయిన మురళీనాయక్ స్మారకార్థం క్రికెట్ టోర్నీ నిర్వహించడం గర్వకారణమన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేకన్న, అమిటి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆలమూరు వెంకట శివారెడ్డి, ఉపాధ్యక్షులు ప్రతాప్, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశులు, కార్యదర్శి మారుతి ప్రసాద్, సహాయ కార్యదర్శి అగిలే జనార్ధన రెడ్డి, కోశాధికారి కుమార్, రాము, చరణ్, శ్రీనివాస్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ మాక్ టెస్ట్



ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పీఆర్టీయూ ఉమ్మడి జిల్లాల కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం నగర శివారులోని తేజ జూనియర్ కాలేజీలో మోడల్ డీఎస్సీ పరీక్ష నిర్వహించారు. సెకండరీ గ్రేడ్, పాఠశాల సహాయకుల అభ్యర్థులు వందలాది మంది హాజరయ్యారు. పీఆర్టీయూ నాయకులు తిమ్మారెడ్డి, బి.రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఉమాదేవి చేతుల మీదుగా ప్రశ్నపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు కేశవరెడ్డి, సి.రామకృష్ణారెడ్డి, రంగారెడ్డి, శంకరరెడ్డి, నాగభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితాలు రాకుండానే ఆప్షన్స్ పెట్టుకోవాలా?

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి సీనియారిటీ జాబితాలు విడుదల చేయకుండానే బదిలీలకు ఆప్షన్స్ పెట్టుకోవాలని ఆదేశించడం దుర్మార్గమైన చర్య అని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 30 సంవత్సరాల చరిత్రలో ఇలాంటి బదిలీలు ఉపాధ్యాయులు ఎప్పుడూ చూడలేదన్నారు. వాస్తవ షెడ్యూల్ ప్రకారం ఆదివారం ఎస్ఏలు ఆప్షన్స్ పెట్టుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. కానీ ఇంతవరకు సీనియారిటీ లిస్టులు విడుదల చేయలేదన్నారు. వెన్సీలు చూపలేదన్నారు. మహిళా ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని వాపోయారు. గ్రీవెన్స్ ఇచ్చినప్పటికీ అధికారులు వాటిని రిసాల్వ్ చేశామని చెప్తున్నారు కానీ వారికి రావాల్సిన పాయింట్స్ రావడం లేదన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎస్‌బీఐ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం: అనంతపురం చార్టర్డ్ అకౌంటెట్స్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నీలో ఎస్‌బీఐ జట్టు గెలుపొందింది. రన్నర్స్‌గా సీఏల జట్టు నిలిచింది. నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై టోర్నీని ప్రారంభించారు. తొలుత కిమ్స్ సవీరా డాక్టర్లు, చార్టర్డ్ అకౌంటెంట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో డాక్టర్ల జట్టుపై సీఏల జట్టు విజయం సాధించింది. అనంతరం ఎస్‌బీఐ, ఏపీజీబీ జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా.. ఎస్‌బీఐ జట్టు విజయం సాధించింది. ఫైనల్స్‌లో ఎస్‌బీఐ జట్టు టోర్నీ విజేతగా.. సీఏల జట్టు రన్నర్స్‌కు పరిమితం కావాల్సి వచ్చింది. వల్లభ డెవలపర్స్, బౌన్స్ కిడ్స్ క్లబ్ అండ్ గేమ్ జోన్ సహకారంతో నిర్వహించిన ఈ టోర్నీలో విన్నర్స్, రన్నర్స్ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు.